కథ

# రాజీ

గొల్లపూడి రాజ్యలక్ష్మి

రాత్రి పదిగంటలు దాటింది.

ఫోన్ రింగయింది. టి.వి. చూస్తూ కూర్చున్న ప్రభావతి 'ఈ టైమ్‌లో ఎవరబ్బా!' అనుకుంటూ లిఫ్ట్ చేసింది.

''హలో..నేను ఆంటీ..ప్రతాప్‌ని''

''నువ్వా ప్రతాప్! చెప్పు''

''ఏం లేదు'' అంటూ ఆగాడు సంకోచంగా.

ప్రభావతి కొన్నిక్షణాలు ఆగి ''శమూ-బేబీ బావున్నారా?'' అనడిగింది.

''ఆ విషయం చెప్పాలనే..తను హైదరాబాద్ వస్తోంది!''

''ఇక్కడికా? ఎందుకు? ఎప్పుడొస్తోంది?''

''ప్రస్తుతం ట్రయిన్‌లో వుంది. రేపు ఉదయం అక్కడ దిగుతుంది. ఎందుకంటే..'' ఆగాడు.

''చెప్పుబాబూ! ఏదైనా గొడవ జరిగిందా?''

''జరిగింది చిన్న విషయమే. నాపై అలిగి వస్తోంది''

''దాని సంగతి నీకు తెల్సిందేగా! సీరియస్‌గా తీసుకోవద్దని చెప్పాగా ప్రతాప్! ఇంతకీ ఏం జరిగిందో చెప్పు లేదం..వంఖీ..హక్కులా.., బుక్కులేనా?''

''అలాంటిదే..ఈసారి కాస్త సీరియస్ అయింది. నిన్న రాత్రి తన కొలీగ్ ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లింది. ఆఫీస్‌వర్క్ బాగా వుండటంతో నేను వెళ్లటం కుదరలేదు. క్రచ్ నుంచి బేబీని తెచ్చి ప్రక్కవాళ్లింట్లో అప్పగించి వెళ్లిందిట. అది ఒకటే ఏడుపు. వాళ్లు విసుక్కున్నారు. శమూ రాత్రి చాలా పొద్దుపోయి వచ్చింది. కోపం కంట్రోల్ చేసుకోలేక కాస్త గట్టిగానే నిలదీశాను. అదే నేను చేసిన అపరాధం''

''సరే..వస్తోందిగా! దాంతో నేను మాట్లాడుతాన్లే''

''నేను ఫోన్ చేసినట్లు తనకి తెలియనీయకండి. ప్లీజ్ ఆంటీ! తనకు నచ్చచెప్పి వెనక్కి పంపించండి'' అంటూ ఫోన్ పెట్టేశాడు.

ప్రభావతి నిట్టూర్చింది.

''ఎవరు?'' అడిగాడు మధుసూదనం నిద్రమత్తులో మరోప్రక్కకు పొర్లుతూ.

''ప్రతాప్ చేశాడు. మీ ముద్దుల కూతురు ప్రొద్దున్నే ఇక్కడ దిగబడుతుందిట!''


''శమూ వస్తోందా! గుడ్..గుడ్ దాన్ని చూసి రెండు నెలలయింది. ఎలా వుందో..పిచ్చిపిల్ల!'' అంటూ అంతలోనే నిద్రలోకి జారి గురక పెట్టసాగాడు.

'అదృష్టవంతులు... చీకూ చింతా లేదు. ఎంత హాయిగా నిద్రపడ్తుందో' అనుకుంది.

కూతుర్ని గురించిన ఆలోచనలతో నిద్రపట్టే లక్షణాలు కన్పించలేదు. 'ఎందుకిలా ప్రవర్తిస్తోంది? చీటికి మాటికి మొగుడిమీద అలిగి పుట్టింటికి రావటం..బుజ్జగించి సర్దిచెప్పి పంపించడం ఇదొక అలవాటుగా మారింది. ప్రతాప్‌ని ఎంతో ఇష్టపడి పెళ్లి చేసుకుంది. అతనూ ఎంతో మంచివాడు. చక్కగా కాపురం చేసుకోక ఏమిటీ తిక్కవేషాలు. ఆడపిల్లకు పుట్టింటి సపోర్ట్ వుండాలి. నిజమే! కానీ ఎప్పుడు? అత్తగారింట ఆరళ్లు ఎక్కువై దిక్కుతోచని పరిస్థితి వున్నప్పుడు. దీని విషయంలో అంతా రివర్స్‌గా వుంది. లాభం లేదు. ఈసారి దీనికి స్ట్రాంగ్ డోస్ ఇవ్వాల్సిందే' అనుకుంది ప్రభావతి.

★ ★ ★

''హాయ్ డాడీ!'' సూట్‌కేస్



పక్కన పడేసి తండ్రిని వాటేసుకుంది శమంత.

''ప్రయాణం బాగా జరిగిందా తల్లీ!'' అనడిగాడు కూతురి తలనిమురుతూ.

''అంటే! నేను వస్తున్నట్లు మీకు ముందే తెలుసా? ప్రతాప్ ఫోన్ చేశాడా?''

''నీ మొహం..నీకన్నీ పిచ్చి అనుమానాలే. ముందు ముఖం కడుక్కుని రా. కాఫీ తాగుదువు గాని'' అంది ప్రభావతి.

''చూశావా డాడీ? మమ్మీకి నేను రావటం ఇష్టం లేదు. అందుకే ఎలావున్నావ్? అని ఒక్కమాటైనా అడగలేదు''

''కన్పిస్తూనే వున్నావ్‌గా! ఇంకా ఏం అడగాలి. మీ ఆయనతో గొడవపడి వచ్చి వుంటావని నీ మొహం చూస్తేనే తెలుస్తోంది. చిన్నపిల్లల్లా అలకలు..సిగ్గు లేదుటే? నీకు మూడేళ్ల కూతురుందని మర్చిపోకు''

''అబ్బా..రాగానే మొదలుపెట్టావ్ పాఠాలు! నీతో ఇదే చిక్కు మమ్మీ.. ముందు అర్జెంట్‌గా మంచి కాఫీ తెచ్చివ్వు!''

''మీరు కూడా ఏమిటండీ? ఎందుకొచ్చిందో..ఏమిటో అడక్కుండా ఆ గారాబం ఏమిటి?'' అంది మధుసూదనంతో ప్రభావతి.

''ఇది దాని పుట్టినిల్లని మర్చిపోకు. ఎప్పుడైనా..ఎక్కడికైనా వచ్చే స్వతంత్రం హక్కు వుంది..అట్లాంటి పిచ్చి ప్రశ్నలు నేను అడగను!''

''స్వతంత్రాలూ..హక్కులూ అంటూ అది ఏం చేసినా సమర్థించటం మంచిదికాదు''

''దేనికైనా సమయం, సందర్భం వుంటుంది. నిదానంగా అన్ని విషయాలూ తెలుసుకుని సమర్థించాలా వద్దా అన్నది అప్పుడు ఆలోచిద్దాం.. తొందరపడకు'' అన్నాడు.

శమంత వస్తూ..''మమ్మీ ఏమంటోంది. నేను ఎందుకొచ్చాననేనా?'' అనడిగింది.

''అమ్మ సంగతి నీకు తెల్సిందేగా? కొంచెం చాదస్తం..ప్రతాప్‌ని ఇబ్బందిపెట్టి వచ్చావేమో అని''

శమంత ముఖం చిట్లించింది. ''అతని సంగతి నా దగ్గర ఎత్తవద్దు'' అంది.

''సరే..సరే..ఇప్పుడు మూడ్ చెడగొట్టుకోకు. హాయిగా రిలాక్స్ అవాలని వచ్చావు. అలాగే వుండు. ఎన్నాళ్లు లీవు తీసుకున్నావ్? బేబీని కూడా తెస్తే బాపుండేదిగా?'' అన్నాడు.

''దానికి వాళ్ల డాడీ వుంటే చాలు. నా అవసరం లేదు''

''నువ్వూ అంతేగా? నీ కూతురికి నీ పోలికే వచ్చింది'' అంటూ ప్రభావతి కాఫీ అందించింది.

శమంత తల్లివైపు కాస్త కినుకగా చూసి వూరుకుంది.


''అన్నట్లు ఇవాళ కనకదుర్గ ఆంటీ వాళ్లింటో లలిత పూజ...సహస్రం పారాయణ వుంది. త్వరగా వెళ్లాలి. నువ్వు కూడా రారాదూ!'' అన్నది కూతురి ముఖకవళికల్ని గమనిస్తూ.

ఒక్కసారిగా కాఫీ కొరబోయి నెత్తికొట్టుకుంటూ ''ఏమిటీ? అక్కడికి నేనా? మైగాడ్.. నన్ను ఇబ్బంది పెట్టకు. నాకు వేరే పనుంది. ఫ్రెండ్స్‌ని కలవాలి'' అన్నది శమంత.

ప్రభావతి కనకదుర్గగారింటి నుంచి వచ్చే సమయానికి శమంత స్కూటీ తీసి బైటకు వెళ్తోంది. కూతుర్ని కాస్త దిగులుగా చూస్తుండిపోయింది. జీన్స్‌పాంట్..పైన టాప్.. భుజాలు దాటని జుట్టు..వుండీ లేనట్లున్న బొట్టు.. 'అసలు ఇది నాకూతురేనా? ఎంత మారిపోయింది. చిన్నప్పుడు ఎలా వుండేది. పరికిణీ జాకెట్టు, పిరుదులు తాకే జడ..చెవులకు జూకాలు, కళకళలాడుతూ తనతో పాటు గుళ్లకూ, గోపురాలకూ వెంట తిరిగేది. తను చెప్పినట్లు వినేది. స్కూలుచదువు ముగిసి కాలేజీలో చేరాకే మార్పు మొదలైంది. 'ఎప్పుడూ ఈ పూజలూ, దేవుళ్లూ, ఏంటి మమ్మీ! బోర్ కొడుతుంది. నన్ను వదిలేయ్' అనేది. స్నేహితులు..చదువు.. సరదాలు.. వాళ్లతో కబుర్లు, దాని ప్రపంచమే వేరైంది. ముఖ్యంగా మయూరితో స్నేహం కాస్త ఆధునికంగా వున్నా ఆ అమ్మాయంటే తనకీ ఇష్టమే. ఆ పిల్ల రచయిత్రి సుధామయి కూతురని తెలిశాక మరింత సంతోషించింది. ఆ అమ్మాయి మాటలు...భావాలు.. కొత్తగా ఆసక్తిగా అన్పించేది. ప్రతిదాన్నీ 'ఎందుకు చేయాలి? చేయకపోతే ఏమౌతుంది? నాకిలాంటి వాటిపై నమ్మకం

## సొంత గొంతు!

**ఒకప్పుడు హీరోహీరోయిన్లు తమ పాత్రలు తామే డబ్బింగ్ చెప్పుకోవడమే కాదు, పాటలు కూడా పాడుకునేవారు. కానీ కాలంతో ప్లేబాక్‌తో పాటు డబ్బింగ్ వాయిస్‌లు వచ్చేయడంతో భాష రాని వాళ్లు సైతం కెమెరా ముందు నటించిపారేస్తున్నారు. అయితే ఇప్పుడు హీరోయిన్లు తమ పాత్రకి తామే డబ్బింగ్ చెప్పుకోవడం అనేది గొప్ప విషయం అయి కూర్చుంటోంది. 'బతుకమ్మ' సినిమాతో మరింత పాపులారిటీ సంపాదించుకున్న సింధు తులానీ రాబోయే తన చిత్రం 'బ్లాక్ అండ్ వైట్'లో తన పాత్రకి తనే వాయిస్ ఇవ్వాలని తెగ ఉబలాటపడుతోందిట. మంచిదే కదా!**



లేదు. గుడ్డిగా అనుసరించే వాళ్లను చూస్తే నాకు జాలి. మా మమ్మీ కూడా అదే అంటుంది. ఏ విషయాన్నయినా మన మనసుతో చూసి ఆలోచించి నిర్ణయించుకోవాలని!'' అంటుంది.

ఆ పిల్లపై తల్లి ప్రభావం చాలా వుంది. అది సహజమే. పిల్లలపై తల్లిదండ్రుల ప్రభావం లోకంలో వుండేదే! అయితే శమంతతోనే తనకు సమస్య మొదలైంది. ఏది చెప్పబోయినా తీసిపడేస్తూ 'పోమ్మా..నీది మరీచాదస్తం' అంటూ వ్యతిరేకించడం ఆందోళన కల్గించేది. పత్రికల్లో వచ్చే సుధామయి రచనల్ని అడపాదడపా తనూ చదివేది.

ముఖ్యంగా స్త్రీల జీవితాల్లో ఎదురయ్యే చిన్న చిన్న సంఘటనలు కూడా ఆమె వ్యక్తిత్వాన్ని ఎలా కృంగదీస్తాయో చిత్రిస్తూ, వాటిని చాకచక్యంగా ఎలా ఎదుర్కొని జయించాలో తన పాత్రల ద్వారా సూచించేది. అందుకే ఆవిడ గుర్తుండిపోయింది. ఒకసారి రవీంద్రభారతిలో ఏదో కల్చరల్ ప్రోగ్రాంలో ఆవిడ్ని కలవటం తటస్థించింది. తమ పరిచయాలు అయ్యాక 'శమంత చాలా మంచి పిల్ల. ఏది చెప్పినా ఇట్టే గ్రహిస్తుంది. అందం తెలివి చురుకుతనం..అన్నీ వున్నాయ్. అందుకే తనంటే నాకిష్టం' అంటూ పొగిడింది. తన వివరాలు అడిగింది. 'చదువుకుని కూడా ఇంట్లో ఖాళీగా వుంటున్నారా? ఏదైనా చేయొచ్చు కదా? పోనీ పుస్తకాలన్నా చదువుతారా? ఎప్పుడూ పూజలూ-పునస్కారాలేనా?' అన్నది చటుక్కున. తన మనస్సు చివుక్కుమంది. 'నిజమే. తనకు దేవుడిమీద నమ్మకం ఎక్కువ. పూజలూ-వ్రతాలూ కాస్త ఎక్కువగానే చేస్తుంది. దానివల్ల ఎవరికీ నష్టంలేదే. అదొక లోపంగా ఇలా ఎత్తిచూపటం సంస్కారం అన్పించుకుంటుందా?' అని చిరాకేసింది.

''మీ కథలు చదివాను. స్త్రీల సమస్యల గురించి, హక్కుల గురించి ఎక్కువగా రాస్తారు కదా! బావుంటాయి'' అన్నది తను టాపిక్ మారుస్తూ.

''నా కథల్లోని ప్రత్యేకత అదే! ఛాందస భావాలున్నవాళ్లు కూడా వదలకుండా చదువుతారు. అందుకే గర్వంగా ఫీలవుతాను. ఎంతోమంది స్త్రీలు వాళ్లకున్న స్వేచ్ఛను, హక్కుల్ని అవకాశాలను 'ఆడతనం' అనే చిన్నబలహీనత వల్ల నష్టపోతున్నారు. అదే నా ఆవేదన. ఈ సంఘంలో భద్రత అనేది ఒక మగవాడి అండవల్ల వాడికి దాసోహమనటం వల్ల వస్తుందని భ్రమలో వున్నారు చాలామంది. నిజానికి మగవాడికి, నైతికంగా మానసికంగా బలాన్నీ ఇంటికి భద్రతా - కుటుంబ సంరక్షణా ఇచ్చేది స్త్రీయే కదా! అసలు స్త్రీ శక్తిముందు - పురుషుడు అంగుష్టమాత్రమే'' అన్నది సుధామయి.

''వావ్..ఎక్సలెంట్ ఆంటీ! మీలాంటివాళ్లు ఇంటికొకరుంటే..ఈ ప్రపంచం అంతా స్త్రీశక్తితో నిండిపోతుంది. మీ కథలే కాదు మాటలు కూడా నరాల్లో శక్తినీ, ఉత్సాహాన్నీ పరుగులెత్తిస్తాయి!'' అంది శమంత.

''మీ ఆకాంక్ష నెరవేరాలని కోరుకుంటున్నాను!'' అన్నది తను.

అంతలోనే ఆవిడ దృష్టి తన కుడిచేతికున్న 'తోరం' మీద పడింది.

''ఏమిటది? మెళ్లో వున్నది చాలదా? చేతులకూ కాళ్లకూ్కడా తాళ్లూ దారాలు దేనికి? బంధించినట్లుగా అన్పించదా?'' అంది కాస్త ఆక్షేపణగా.

తనకాశ్చర్యం వేసింది. కాస్త ఇబ్బందిగానూ అన్పించింది. ''భలేవారే..ఇంకా నయం. మనం కట్టుకున్న బట్టలు కూడా బంధనాలన్నారు కాదు!'' అని నవ్వి ''మన సంస్కృతిలో అనూచానంగా వస్తున్న కొన్ని సంప్రదాయాలు కుటుంబానికి శుభాన్నీ సంతోషాన్నీ ఇచ్చేవి. శ్రావణమాసం నోములో ఇదొక పవిత్రమైన తోరబంధనం. ముత్తయిదువులకు కడ్తారు!'' అని వివరిస్తూ ''ఏదైనా మనం చూసే దృష్టిని బట్టి వుంటుంది'' అంటూ చురకలేసింది. ఆవిడ ముఖం కాస్త ముడుచుకుంది. అంతలోనే ఏమనుకుందో..''మీ నమ్మకాల్ని కించపరచాలని కాదు నా ఉద్దేశం. ఈ తాళ్లన్నీ ఆడవాళ్లే ఎందుకు కట్టుకోవాలి? ఈ వ్రతాలూ, నోములూ, వాయినాలూ ఉపవాసాలు అన్నీ ఆడవాళ్లకేనా? ఎంత అమాయకత్వమో ఆలోచించారా?'' అన్నది.



''ఎందుకు మమ్మీ నవ్వుతావు? ఆంటీ అన్న దాంట్లో జోకేముంది?'' అన్నది శమంత.

''ఏం లేదు. ఆమధ్య ఏదో సినిమా వచ్చింది చూడు! మగాళ్లంతా ఆడవాళ్లలాగా - ఆడవాళ్లు మగవాళ్లలాగా ప్రవర్తించటం గుర్తొచ్చిందిలే! సారీ..నా నవ్వు మిమ్మల్ని నొప్పిస్తే...''

''ఫర్వాలేదు. నవ్వండి! నవ్వటం ఆరోగ్యానికి మంచిదే. కొన్నితరాలుగా ఒక పద్ధతికి అలవాటుపడి - తద్భిన్నంగా వుండటం గురించి ఆలోచిస్తే హాస్యంగానే అన్పిస్తుంది. అయితే నా భావాన్ని సరిగ్గా మీరు అర్థం చేసుకుని కాస్త లోతుగా ఆలోచిస్తే ఎంత హాస్యాస్పదంగా బ్రతుకుతున్నామో అర్థమౌతుంది. ఆ పరిస్థితినుంచి బైటపడాలన్న తపన కలుగుతుంది. ఎప్పుడా చైతన్యం వస్తుందో అప్పుడే స్త్రీ వెన్నెముకగల వ్యక్తిగా నిలబడగలుగుతుంది. అంతదాకా మోక్షం వుండదు!'' అన్నది కాస్త గంభీరంగా.

## తెలుగుపై మోజు!

**బాలీవుడ్ భామ హన్సిక 'దేశముదురు' సినిమాలో నటించే రోజుల్లో టాలీవుడ్‌పై అంతగా ఆసక్తిని కనబరచలేదు. ఆ సినిమా విజయం తర్వాత కూడా వచ్చిన అవకాశాల్ని ఠక్కున ఒప్పేసుకోలేదు. కారణం బాలీవుడ్‌పై మోజే! కానీ ఇప్పుడు అక్కడ ఆశించినంత వేగంగా కెరీర్ ముందుకెళ్లకపోవడంతో తిరిగి టాలీవుడ్‌లోకి వచ్చిన ఆమెకి 'కంత్రి' సక్సెస్ మరిన్ని ఆఫర్లని తెచ్చిపెట్టింది. అందుకనే ఇప్పుడామె నాకు తెలుగు పరిశ్రమ అంటే ఎంతో ఇష్టం, తెలుగు ప్రేక్షకులన్నా కూడా ఎంతో అభిమానం అంటూ చిలకపలుకులు పలుకుతోంది. తెలుగు స్పష్టంగా మాట్లాడేందుకు తెలుగుని నేర్చుకుంటోందిట కూడా.**

★ ★ ★

ఇంటికొచ్చాక- ''ఏంటమ్మా అలా మాట్లాడావు? మన చాదస్తాలన్నీ ఆంటీకి తెలియాలా?'' అన్నది శమంత.

''చాదస్తాలేమిటీ? ఇన్నాళ్లూ లేనిది ఇప్పుడనిపిస్తోందా? ఎందుకని? ఆవిడ ప్రభావం నీపై బాగా వుండటం వల్లనేగా? నేనలా అన్నిటికీ తల వూపలేను. నా అభిప్రాయాలు నాకుంటాయి. వాటిని చాదస్తం అన్నా పట్టించుకోను. అదలా వుంచు. చదవేస్తే వున్న మతీ పోయిందన్నట్టు నువ్వు చేసిందేమిటి? ఆవిడముందు నన్ను చులకనగా మాట్లాడలేదూ? నాపై కథ రాయాలిట కథ! చెంప పగలగొడదామనిపించింది!'' అంది కోపంగా.

''ఆవిడ అభిప్రాయాన్ని ఖండించటం నాకు నచ్చలేదు మమ్మీ..అందుకే అలా అన్నాను!''

''లోకోభిన్నరుచిః అన్నారు. ఏ మనిషీ మరో మనిషిలా వుండడు. ఆలోచనల్లో-స్వభావాల్లో ఎంతో తేడా వుంటుంది. ఎవరి జీవనశైలి వారిది! అలా ఏమిటి? ఇలా వుండొచ్చుకదా! అనటంలో అర్థం లేదు. ప్రతి విషయాన్నీ రంగుటద్దాలోంచి చూస్తూ ఎదుటి మనిషిని శంకిస్తూపోతే వాళ్లు మానసికరోగి అవుతారు'' అన్నది కాస్త సీరియస్గా.

''అబ్బా..మమ్మీ..నీది ఒకే విధమైన ధోరణి. ఇది నీ చిన్నప్పటికాలం కాదు. ఎంతో మారిపోయింది. ఆలోచనల్లో గానీ, జీవన విధానంలోగానీ అప్పటికీ ఇప్పటికీ ఎంతో మార్పు వచ్చింది. కొంచెం ఆధునికంగా ఆలోచిస్తేగానీ అర్థం కాదు''

''అర్థం కాకపోతే పోనీ! నా వరకు నా జీవితం హాయిగా వుంది. అది చెడగొట్టుకోవటం నాకిష్టం లేదు. నువ్వు కూడా వాళ్లతో మరీ అతిగా వుండక నీ లిమిట్లో నువ్వుండు. ఈ స్త్రీజనోద్ధరణ కలాపాలు అవతలపెట్టి చదువుమీద దృష్టి పెట్టు'' అంది మందలింపుగా.

''చూశావా డాడీ?'' అంది తండ్రితో ఫిర్యాదుగా.

''పోనీయమ్మా..మీ ఇద్దరిమధ్య అనవసరంగా ఎందుకీ రగడ? వదిలేయ్..ఒకటి చెప్పనా? ఈ ప్రపంచం ఏ ఒక్కరి తెలివితోనో..ఆలోచనతో నడవదు కదా?'' అన్నాడు తేలిగ్గా.

'ఈ మనిషింతే..ఏ విషయాన్ని సీరియస్గా తీసుకోరు!' అనుకుంది ప్రభావతి విసుగ్గా.

ఆ తర్వాత సుధామయిని కలవటం తటస్థపడలేదు. ఆసక్తీపోయింది. శమంత కూడా తన దగ్గర వాళ్ల ప్రసక్తి తేవటం తగ్గించింది. అయితే తనకు తెలియకుండా వాళ్లతో సంబంధాలు కొనసాగిస్తూనే వుంది. ఆ విషయం తనకు అర్థమౌతున్నా, దీని మొండివైఖరి ముందు నిస్సహాయురాలైంది.

చూస్తూండగానే రెండేళ్లు గడిచినయ్. శమంత ఫైనలియర్లోకి వచ్చింది. ఆ ఆదివారం ఎక్కడికీ వెళ్లకుండా ఇంట్లో కుదురుగా కూర్చుని పుస్తకం చదువుతున్న కూతుర్ని చూసి 'ఇవాళేదో అయింది దీనికి..టి.వి. కూడా చూడకుండా చదువుమీద ఇంత శ్రద్ధ పుట్టుకొచ్చిందేమిటో' అనుకుంది ప్రభావతి. వంట పూర్తిచేసి పూజ కూడా ముగించుకుని వచ్చినా ఇంకా శమంత పూర్తిగా పుస్తకంలో లీనమయిపోయి వుండటం చూసి ఏదో అనుమానం వచ్చింది. దగ్గరికెళ్ళి పరిశీలిస్తూ ''ఏం పుస్తకం అది?'' అనడిగింది.

''స్త్రీ స్వేచ్ఛ..మగవాడి జులుం'' అంది.

''ఇలాంటి పుస్తకం ఒకటి వచ్చిందా?''

''ఇందులోని మేటర్ అది..పుస్తకం పేరు..'ఆడపిల్ల కాదు..ఆదిశక్తి అనండి!''

''ఎవరు రాశారు?''

''సుధాంటీ! మొన్ననే పబ్లిష్ అయింది. చదవమని ఇచ్చారు. నిజంగా సుపర్బ్..ఏకబిగిన చదివించేలా అద్భుతంగా వుంది''

''ఇప్పుడిది చదవటం నీకవసరమా? ముందు నీ చదువు సంగతి చూసుకో. ఇవి చదవటానికి ముందు చాలా సమయం వుంది!''

''మమ్మీ..ప్లీజ్..ఇప్పుడు సాధింపు మొదలుపెట్టకు'' అంది విసుగ్గా.

''నేనేం చెప్పినా నీ మంచికే! అది గుర్తుపెట్టుకో''

''ఇది కూడా మంచిని బోధించేదే. వ్యక్తిగా ఎదిగి శక్తిగా ఎట్లా మారాలో చెప్పే పుస్తకం!''

''అసలు నీ పద్ధతి నాకేం నచ్చటం లేదు''

''నచ్చదని తెలుసు. నీ ఆలోచనల్లోంచి నేను ఎదగాలనుకుంటావు. కానీ..నాకూ స్వంత అభిప్రాయాలూ - ఇష్టాలూ వుంటాయని మర్చిపోకు!'' అంటూ అక్కడ్నించి లేచి వెళ్లిపోయింది.

'భగవంతుడా! ఎదిగినపిల్ల అని సరిపెట్టుకోవాలా... ఆలోచనా ధోరణిలో వచ్చిన ఈ మార్పు తన జీవితంమీద ఎలాంటి ముద్ర వేస్తుందో అని ఆందోళనపడాలో అర్థం కావటం లేదు!' అనుకుంది భారంగా.


ఓ రోజు 'బ్యూటీపార్లర్'కి వెళ్లి జుట్టు భుజాల దాకా కట్ చేయించుకుని వచ్చింది.

''నిక్షేపంలాంటి జడ..నీకిదేం బుద్ధే?'' అంటూ లబలబ లాడింది ప్రభావతి. తనకు తెలీకుండా తండ్రిని సంప్రదించి జీన్స్ కొనిపించుకుంది. మధుసూదనాన్ని నిలదీస్తే ''పోన్లే ముచ్చటపడుతోంది. మనకు మాత్రం ఎవరున్నారు అది తప్ప'' అన్నాడు తేలిగ్గా. కొంతకాలం తర్వాత ప్రతాప్‌ని వెంటపెట్టుకుని తిరుగుతుంటే ''ఇవాళిది చాలా సాధారణం. అలా బైటకెళ్లి చూడు. అర్థమౌతుంది. తోటివిద్యార్థులతో కలివిడిగా వుండకుండా మడికట్టుకుని వుంటే నలుగురూ గేలి చేస్తారు దాన్ని'' అన్నాడు కొట్టి పారేస్తూ.

ప్రతాప్ తరచుగా ఇంటికొచ్చేవాడు. అతని భుజాన్ని తాకుతూ 'ఏరా, ఒరేయ్' అంటూ సంబోధిస్తుంటే ప్రభావతికి తేళ్లూ,

## డేరింగ్ గాళ్!

**సొట్టబుగ్గల సుందరి ప్రీతీ జింటా ఐపిఎల్ టోర్నమెంటులోని పంజాబ్ కింగ్స్ ఎలెవెన్ టీమ్‌కి ఓనరన్న సంగతి తెలుసు కదా! ఆ టీమ్ సెమీఫైనల్స్‌లో ఓడిపోయింది. అయినా ఆమె ఏమాత్రం తను బాధపడడం లేదని జట్టుని సపోర్ట్ చేసింది. ప్రీతిని ఈ క్రికెట్ బిజినెస్‌లోకి అసలు రావద్దని నష్టపోవాల్సి వస్తుందని ఆమెకి సన్నిహిత మిత్రుడొకాయన చెప్పాడట. ఆయన పెద్ద ఆస్ట్రాలజర్ కూడానట. ఆయనలా చెప్పినా ప్రీతి లెక్క చేయలేదు. భవిష్యత్తు క్రికెట్ టోర్నమెంటుల్లో తను విజయం సాధిస్తానంటోంది ప్రీతి.**



జెర్రులూ పాకినట్లు వుండేది.

'ఇదసలు నా కూతురేనా? ఏమిటా వెర్రి చేష్టలు? లాభం లేదు. దాన్ని ఇష్టానుసారంగా వదిలేసి పూర్తిగా చెడగొడుతున్నారీయన. సాధ్యమైనంత తొందరగా పెళ్లిచేసి పంపిస్తే మంచిది!' అన్న నిర్ణయానికొచ్చింది ప్రభావతి.

''చదివింది చాలు. మంచి సంబంధం చూడండి!'' అన్నది భర్తతో.

''నేను చూసేదేమిటి? అదే చూసుకుంది!'' అన్నాడు.

''చూసుకుందా? ఎవర్ని?''

''ఇంత అమాయకంగా వుంటే ఎట్లా? ప్రతాప్ అంటే ఎంతిష్టమో చూస్తూనే వున్నావ్‌గా?''

''అతను.. క్లాస్‌మేట్.. ఫ్రెండ్ కదా?''

''ఫ్రెండే.. ఆ ఫ్రెండ్‌షిప్‌లోంచే ప్రేమ.. ఆ తర్వాత పెళ్లి''

''ఏమిటిదంతా? నాకిట్లాంటివన్నీ నచ్చవని మీకు తెల్సుకదా?''

''నీకు నచ్చినా.. నచ్చకపోయినా జరగబోయేదదే! అమ్మాయి మనసుని అర్థం చేసుకుని ఆశీర్వదిస్తే మంచిది. లేదంటే ఈ ఇంట్లో ఒకరికొకరం దూరమైపోతాం''

''మీరన్నట్లు నేను నిజంగా పిచ్చిదాన్నే. అది బాగా చదివి మంచి ఉద్యోగంలో స్థిరపడ్డాక మనం ఏరి కోరి తెచ్చిన వరుడ్ని చేసుకుని ముచ్చటగా కాపురం చేసుకుంటుందని ఎన్నో ఊహించాను. నా ఆశలన్నీ అడుగంటినయ్!'' అన్నది ఖిన్నురాలై.

''ఇప్పుడు మాత్రం ఏం కొంపలు మునిగాయని? వాళ్లు చదువులు పూర్తి చేసి ఉద్యోగాలు వచ్చాకే పెళ్లి చేసుకుంటారు. మన ఆశలు కోరికలు వాళ్లమీద రుద్దటం అవివేకం. దానికి ఇష్టమైనవాడ్ని చేసుకుని సుఖంగా వుండాలని కోరుకోవటం మంచి తల్లి లక్షణం'' అన్నాడు.

మనసులో అసంతృప్తి అన్పించినా 'అదీ నిజమే ప్రతాప్ మంచికుర్రాడే. ఒకటే కులం. 'ఆంటీ' అంటూ కలివిడిగా వుంటాడు. ఒడ్డూ పొడుగుతో శమంతకు జోడీగా బాగానే వుంటాడు' అని సర్దిచెప్పుకుంది.

చదువు అవుతూనే ప్రతాప్‌కి మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాత పెళ్లి జరిగిపోయింది. బెంగుళూర్‌లో కాపురం. ఆర్నెలలు ప్రశాంతంగా గడిచి వుంటాయి. అక్కడ్నించి మొదలైనయ్ చిటపటలు. బేబీ కడుపునపడటం, శమంతకు జాబ్ రావటం ఒకేసారి జరిగాయి.

''అప్పుడే ఎందుకీ న్యూసెన్స్.. అబార్షన్ చేయించుకుంటాను'' అన్నది ప్రతాప్‌తో.

''నాకు పిల్లలంటే చాలా ఇష్టం.. ఈ ఒక్కసారికీ ఓపికపట్టు!'' అన్నాడు ప్రతాప్.

''మరి నా కెరీర్ సంగతేమిటి? జాబ్ వదులుకోనా?''

''ఇదిపోతే తర్వాత మరొకటి వస్తుంది. నో ప్రోబ్లం... నిన్ను తల్లిగా చూడటమే నాకిష్టం!''

''నీకిష్టమైతే నాకిష్టం వుండొద్దూ! ఈ చెత్త నా వల్ల కాదు'' అన్నది ఖండితంగా.

బ్రతిమాలేడు.. ప్రాధేయపడ్డాడు. అలిగాడు. చివరకు కోపగించుకున్నాడు..''ఇది ప్రతి స్త్రీకి తప్పదు. దానికి నువ్వేం మినహాయింపు కాదు'' అన్నాడు.

''పిల్లల్ని కనడం కనకపోవటం అన్నది కేవలం నా ఇష్టప్రకారమే జరగాలి. నీకేం హక్కులేదిందులో. ఇట్లాగే మాట్లాడితే నీ మొహం కూడా చూడను'' అంటూ అలిగి పుట్టింటికొచ్చింది. ప్రతాప్ అత్తగారు మామగారు ద్వారా ఎలాగో శమంతను శాంతింపచేసి రాజీ చేసుకున్నాడు.

''ఈ ఒక్కసారికి నా మాటకు విలువిస్తే ఆ తర్వాత బాధ్యతంతా నాదే. నీకేం కష్టం వుండదు'' అని కాళ్లావేళ్లా పడ్డాక బేబీని కన్నది. అన్నమాట ప్రకారం బేబీ పుట్టాక తన సంరక్షణ బాధ్యతంతా తీసుకున్నాడు. తండ్రి ఆలనాపాలనలోనే పెరిగింది బేబీ. శమంత జాబ్‌లో చేరింది. మంచి జీతం. కొత్త పరిచయాలు ఏర్పడ్డాయి. ఫ్రెండ్స్.. వీకెండ్ పార్టీలు, పిక్నిక్‌లు.. బాధ్యతలేని జీవితం.. ఇంట్లో బేబీ అరుపులు.. ఏడుపులు, ప్రతాప్ బుజ్జగింపులు.. ఎంతో విసుగ్గా వుండేది. పగలంతా క్రచ్‌లో వుంచినా రాత్రుళ్లు, సెలవుదినాల్లో కూతురి సంరక్షణతో కాలక్షేపం చేసే ప్రతాప్ బయట తిరగటానికి పెద్దగా ఇష్టపడేవాడు కాదు. దాంతో ఇద్దరిమధ్యా దూరం పెరిగింది. చిన్న చిన్న విషయాలకే అతనితో వాదన పెట్టుకుని అలిగి పుట్టింటికి చేరడం అలవాటయింది. గత మూడేళ్లుగా జరుగుతున్న కథ ఇది.

★ ★ ★

మధుసూదనం కూతురి ధోరణికి అలవాటు పడిపోయాడు గానీ.. ప్రభావతికి మింగుడుపడటం లేదు. 'ఏం చేయాలి? దీన్ని ఎలా దారికి తేవాలి?' అన్న ఆరాటం! శమంత కాపురం స్థిరంగా, ప్రశాంతంగా వుండాలని దేవుళ్లకు మొక్కింది.

నాలుగు రోజులు గడిచినయ్.

ఆ రాత్రి భోజనాల సమయంలో ప్రతాప్ ఫోన్ చేశాడు శమంత సెల్‌కు. శమంత లిఫ్ట్ చేయకపోవటం గమనించి ''ఎవరో చూడరాదూ?'' అంది ప్రభావతి.

''ఇంకెవరు? ప్రతాప్. ఏం వుంటుంది రమ్మని బ్రతిమాలుతూ విసిగిస్తాడు''

''అతన్నే ఏరి కోరి చేసుకున్నావు. ఇప్పుడెం

## ఎనిమిదేళ్లు- యాభై సినిమాలు

**స్నేహ వెండితెరకి వచ్చి ఎనిమిదేళ్లు పూర్తిచేసుకుంది. ఈ ఎనిమిదేళ్లలో తెలుగు, తమిళ సినిమాల్లో యాభై సినిమాల్లో నటించిందామె. రాబోయే రజనీకాంత్ సినిమా 'కుచేలన్ (తెలుగులో 'కథానాయకుడు') స్నేహ నటిస్తున్న యాభయ్యవ సినిమా. ఈ ఎనిమిదేళ్లలో తనపై వచ్చిన రకరకాల రూమర్లని తను ఏమాత్రం పట్టించుకోకుండా వర్క్ మీదే దృష్టి పెట్టాననీ అందుకనే ఇంతగా రాణించగలిగాననీ ఎంతో ధీమాగా చెప్పుకుంటుంది స్నేహ. మరో రెండేళ్లు ఇండస్ట్రీలో వుంటానంటోంది స్నేహ. అంటే పదేళ్ల సినీ కెరీర్ తర్వాత తన తరువాతి భవిష్యత్తు గురించి ప్లాన్ చేసుకుంటోందిట.**



దుకా విసుగు?''

''చేసుకుంటే ఏంటి? మొహం చింకిచాటంత చేసుకుని మాట్లాడటమే మహాభాగ్యంగా తల చాలా?'' అంది కాస్త కోపంగా.

సెల్ మోగటం ఆగింది. హాల్లో లాండ్ ఫోన్ రింగయింది. ప్రభావతి లిఫ్ట్ చేసింది.

''హలో.. ఆంటీ.. శమూలేదా?'' అనడిగాడు ఆత్రంగా.

''వుంది! ఏమిటి విషయం?''

''బేబీకి జ్వరం.. నూటనాలుగు.. మమ్మీ ఏదీ? అని అడుగుతోంది. ఒకసారి పిలుస్తారా?''

''బేబీకి జ్వరంట. ప్రతాప్ నీతో మాట్లాడాలిట. లైన్‌లో వున్నాడు'' అంది కూతురితో.

''అంతా డ్రామా!''

''వెళ్లు తల్లీ! అతను వెయిట్ చేస్తున్నాడు. విషయం ఏమిటో తెలుసుకో!'' అన్నాడు తండ్రి.

''ఏం వుండదు డాడీ.. బేబీని అడ్డంపెట్టుకుని నన్ను రప్పించాలని''

''ఛ! నీదసలు గుండెకాదే.. పాషాణం.. కూతురికి వంట్లో బాలేదంటే ఏ తల్లయినా ఇట్లా మాట్లాడుతుందా?''

''ఇదిగో.. ఇదే! ఇలాంటి సెంటిమెంట్‌తోనే ఆడది జావగారిపోయి మగాడి దృష్టిలో అలుసైపోయింది. నేను తల్లయితే అతడు తండ్రి! బాగానే చూసుకుంటాడులే''

''అంటే? నీకే స్పందనలు లేవా? మమతానురాగాలు, అనుబంధాలు వద్దనుకుంటే పెళ్లెందుకు చేసుకున్నావే?''

''చేసుకుంటే? అన్నీ వచ్చినట్టు భరించాలా? బేబీ కావాలని పట్టుబట్టింది అతను. కావాలనుకున్నప్పుడు అన్నీ భరించాల్సిందే!''

''వాదనలు ఇప్పుడొద్దు! ముందా ఫోన్ సంగతి చూడు శమూ'' అన్నాడు మధుసూదనం కాస్త మందలింపుగా.

అయిష్టంగానే వెళ్లి రిసీవర్ అందుకుంది. ''చెప్పు'' అంది.

''బేబీకి జ్వరం. ఒళ్లుకాలిపోతోంది. ఏం చేయాలో తోచటం లేదు. నువ్వుంటే బావుండేది!''

''అది ఇప్పుడు కాదు. నువ్వు నా చెంప పగలగొట్టినప్పుడు వుండాల్సింది!''

''సారీరా.. ఆ సిట్యుయేషన్‌లో నన్ను నేను కంట్రోల్ చేసుకోలేకపోయాను. వెరీ వెరీ వెరీ సారీ.. ఇంకా సంగతి మర్చిపో! రేపు ఫ్లయిట్‌లో వచ్చేయ్. బేబీ కలవరిస్తోంది. ప్లీజ్..''

''జోకులు ఆపు..'

''నిజం శమూ!''

''చూడు.. నాకసలే తలనెప్పిగా వుంది. ఫోన్ పెట్టేయ్!''

ప్రభావతి టెన్షన్‌గా వింటోంది. 'చెంపమీద కొట్టాడా? ఎందుకు? ఏదో చిన్న కలహం అనుకుంటోంది. వీళ్ల మధ్య సామరస్యం ఇంతగా చెడిపోయిందా; ఇప్పుడేం చేయాలి. పసిదానికి జ్వరమన్నా దీని మనసు కరగటం లేదు. మధుసూదనం వైపుచూసింది. అతను ఆగమన్నట్లు సైగ చేశాడు. తిరిగొచ్చి కంచంముందు కూర్చుని అన్నాన్ని కెలుకుతూ ఆలోచిస్తున్న కూతురితో అన్నాడు గంభీరంగా.

''రేపు ఫ్లయిట్‌కి టికెట్ బుక్ చేస్తున్నాను. నువ్వు బెంగుళూరు వెళ్తున్నావు''

''నో డాడీ నేను వెళ్లను''

''ఇష్టం లేకపోయినా తప్పదు.. బేబీ కోసం''

''ఎవరికోసమైనా నా నిర్ణయం మారదు. అసలేం జరిగిందో మీకు తెలిస్తే..''

''తెలిస్తే?''


శమంత హఠాత్తుగా చేతిలో ముఖం దాచుకుని ఏడవసాగింది. మధుసూదనం, ప్రభావతి కంగారుపడ్డారు. మధుసూదనం గాంభీర్యం చెదిరిపోయింది. ''శమూ ప్లీజ్ ఏడవకు. నా తల్లివి కదూ? ఇంతగా నీ మనసు కష్టపడేంతగా ఏం చేశాడు ప్రతాప్?'' అనునయంగా అడిగాడు.

కళ్లు తుడుచుకుంది.

''అతనో మృగం డాడీ! మగవాడిననే అహంకారం. తన మాటే నెగ్గాలనే పంతం.. అజమాయిషీ.. అతని చెప్పుచేతల్లో వుండటం నా వ్యక్తిత్వానికే తలవంపు. మాకు పొసగదు!'' అంది శమంత.

''అసలేం జరిగిందో చెప్పవే. నా గుండెలు దడదడలాడుతున్నయ్. ఇట్లా కాపురం కూలే మాటలు మాట్లాడకు!'' అంది ప్రభావతి ఆందోళనగా.

''నా కొలీగ్ మదన్ ఇంట్లో ఫంక్షన్ వుందంటే వెళ్లాను. మదన్ ఎంతో మంచివాడు. స్నేహపాత్రుడు. ప్రతాప్‌ని కూడా ఆహ్వానించాడు. 'ఆఫీస్‌లో అర్జెంట్ వర్క్ వుంది. రావటం కుదర'దన్నాడు. నన్ను కూడా వెళ్లొద్దన్నాడు 'బేబీని క్రచ్ నుంచి తీసుకుని ఇంటికెళ్ల'మన్నాడు. నాకొళ్లు మండింది. 'నువ్వు రాకపోతే మానేయ్. నన్ను వెళ్లొద్దనటానికి నీకు హక్కులేదు. బేబీ సంగతి నువ్వే చూసుకో. ఆఫీసవగానే అటే వెళ్తాను' అని ఖరాఖండీగా అన్నాను. మా ఆఫీసు స్టాఫంతా అక్కడే వుండటంతో సరదాగా గడిచిపోయింది. కాస్త ఆలస్యమయింది. వంటరిగా కారు డ్రైవ్ చేసుకుంటూ వస్తుంటే దారిలో స్కూటర్ చెడిపోయిందంటూ ఎవరో ఇద్దరు లిఫ్టు అడిగారు. నేనూ ఆ రూట్‌లోనే వెళ్లాలి కనుక ఒప్పుకున్నాను పోనీకదాని. వాళ్లు కాస్త తాగినట్లున్నారు. పిచ్చి ప్రేలాపన మొదలుపెట్టారు.



## కమలినీ ఆశ!

**'ఆనంద్' లాంటి ఘన విజయం సాధించిన సినిమా ద్వారా పరిచయమైన బెంగాలీ భామ కమలినీ ముఖర్జీ ఆ తర్వాత అవకాశాలు వచ్చినా ఆమెకంటూ పేరు తెచ్చిన సినిమా ఇంతదాకా మళ్లీ లేదు. అయితే ఇప్పుడు కమలినీ ఆశలు చిగురించేలా వంశీ దర్శకత్వంలో హీరోయిన్ చాన్స్ లభించింది. వేణు హీరోగా నటిస్తున్న 'గోపి గోపిక గోదావరి' సినిమాలో వేణుకి జంటగా కమలినీ ఎంపికైంది. వంశీ సినిమా కాబట్టి ఇది తన కెరీర్‌ని మరో మలుపు తిప్పుతుందని ఆశపడుతోంది కమలిని.**

నాలుగు తిట్టి కారులోంచి గెంటి వేశాను. నేను చేసిన పొరపాటు ఒక్కటే. ఇంటికెళ్లాక జరిగిం దాన్ని ప్రతాప్‌కు చెప్పటం. ఒక్కసారిగా నాపై విరు చుకుపడ్డాడు. 'నీకసలు బుద్ధిలేదు. వాళ్లేదైనా దౌర్జన్యం చేస్తే ఏమయ్యేదానివి? నువ్వసలు ఆడదా నివేనా? ఎప్పుడూ పార్టీలు.. ఫ్రెండ్స్‌తో మీటిం గులు. ఆఫీసవగానే ఎప్పుడైనా నేరుగా ఇంటికొ చ్చావా? రోజులో కొంతసేపయినా బేబీతో స్పెండ్ చేయాలనుకోవు. అసలు నీ పద్ధతి నాకేం నచ్చటం లేదు'..'అంటే? నువ్వెళ్లమంటే వెళ్లి - వుండ మంటే వుండి... నీ చెప్పు చేతల్లో వుండాలా? నా సంగతి నీకు బాగా తెలుసు. ఇట్లాంటి ఆంక్షలు నాకు నచ్చవు. జరిగింది చాలు. ఇంకా సీన్ క్రియేట్ చేయకు!' అన్నాను విసుగ్గా.

'ఎంతో ఓర్పుగా వుంటున్నానని లోకువ కట్టకు. ప్రతిదానికీ ఒక హద్దు వుంటుంది' అన్నాడు కోపంగా.

'అంటే ఏమిటర్థం? ఇన్నాళ్లూ నేను నిన్ను టార్చర్ పెడ్తున్నానా..పాపం నువ్వు ఓర్పుగా వుంటున్నావనా?' అన్నాను.

'ఎందుకిలా ప్రవర్తిస్తున్నావ్? ప్రతిదాన్నీ రాద్ధాంతాం చేస్తావ్. విపరీతార్థాలు తీస్తావ్..నీతో పెద్దతలనొప్పి అయిపోయింది నాకు'

''నాకూ అట్లాగే వుంది. ఈ తలనొప్పులు తగ్గా లంటే ఒకటే మార్గం. డైవర్స్ తీసుకోవటం'' అన్నాను

అంతే.. లాగి చెంపమీదకొట్టాడు. స్టయిన్నయి పోయాను. మా గొడవకు బేబీ లేచి ఏడవసాగింది. ఎదురు ఫ్లాట్‌లో లైట్లు వెలిగాయి.

''జరిగిన జాతర చాలు..నోర్మూసుకుని వెళ్లి పడుకో!'' అంటూ బేబీని తీసుకుని వేరే గదిలోకి వెళ్లిపోయాడు. నా మనసు భగభగా మండసాగింది. 'నన్ను కొడ్తాడా? ఎంత పొగరు..దీనికి ఫలితం అనుభవిస్తాడు!' అనుకుని అప్పుడే ఒక నిర్ణయాని కొచ్చాను ఇక అతడితో నాకు పొసగదు. మేం విడిపో వటమే ఉత్తమం అని. అంతే ఒక్కక్షణం అక్కడ వుండబుద్ధి కాలేదు. వచ్చేసాను!'' అంటూ ముగిం చింది శమంత.

''ఉద్ధరించావులే! ఆ పరిస్థితిలో అతడే కాదు ఏ మగాడన్నా అదే పనిచేస్తాడు. తప్పంతా నీదైతే అతన్ని వేలెత్తి చూపటం దేనికి?'' అంది ప్రభా వతి.

''నువ్విలాగే అంటావని తెలుసు. అందుకే 'సుధాంటీ' సలహా కోసం వెళ్లాను. ఆవిడ ఏమందో తెలుసా? 'ఆత్మాభిమానం కల ఆడపిల్లన నిపించావ్. ఎంత కోపం వున్నా భార్యమీద చెయ్యి చేసుకునే ధైర్యం వుందంటే ఆ మగాడ్ని నమ్మటా నికి లేదు. కాలికింద చెప్పులా పడివుండటానికి వ్యక్తిత్వం వున్న ఏ స్త్రీ ఒప్పుకోదు. మంచి నిర్ణయం తీసుకున్నావ్!' అన్నది. ఆ మాటలు విన్నాక నిజంగా నాకెంత బలంగా అన్పించిందో తెలుసా?''

''అంటే ఇదంతా ఆవిడకు చెప్పావా? బుద్ధిలే దుటే! నీ కుటుంబ విషయాల్లో పరాయివాళ్ల జోక్యం దేనికి?''

''ఆవిడ నా శ్రేయోభిలాషి...చక్కటి సలహాలి స్తుంది''

''ఏమిటి ఇచ్చేది? కాపురం కూల్చుకోమనా? మొగుడ్ని, కన్నబిడ్డని దూరం చేసుకుని ఏం ఉద్ధ రించాలని? స్వాభిమానంతోపాటు కాస్త సామ రస్యం కూడా వుండాలి. కన్నతల్లితండ్రులం మేం బతికివుండగా ఆవిడ్ని సంప్రదించటం నాకు చిన్న తనంగా వుంది!''

''నువ్వేం చెప్తావో నాకు తెలుసు. అతనితో రాజీ పడమంటావు. ఒకసారి తలవంచాక నాకంటూ అస్తిత్వం వుంటుందా? ఆ జీవితం నాకొద్దు!'' అంది స్థిరంగా శమంత.

''ఏమిటండీ ఇది? దీనిమొండితనం చూస్తే నాకు చాలా భయంగా వుంది''

''నువ్వూరుకో!'' అన్నాడు మధుసూదనం.

''నా నోరుమూస్తారేంటి? అసలుదాన్ని చెడగొ ట్టింది మీరు. ఇప్పుడు చూడండి. కాపురంలో నిప్పులు పోసుకుంటోంది!'' అన్నది అసహనంగా.

''నిన్ను నోరుముయ్యమన్నానా?''

తండ్రికి అంత కోపం రావటం ఎప్పుడూ చూడలేదు శమంత. తల్లిమీద జాలేసింది.

''మమ్మీ మీద అరవటం దేనికి? అనేదేదో నన్నే అనండి డాడీ!''

''నిన్నలా అనలేను తల్లీ! అంటే మగాడినం టావు. అహంకారం అంటావు. అణిచివేత అంటావు. పాతదే అయినా ఒక విషయం చెప్తాను. బండి సజావుగా నడవాలంటే ఎడ్లు రెండు సామర స్యంగా లాగాలి. చెరోవైపులాగినా అందులో ఒకటి సవ్యంగా లేకపోయినా బండి కూలిపోతుంది. పోతే పోయిందిలే అనుకునేటట్లయితే బండి కట్టటం ఎందుకు? ప్రయాణమెందుకు? నా ఇల్లు, నా భర్త, నా పిల్లలు, నా సంసారం అనే మమకారం, స్వార్థం కొంచెమయినా లేకపోతే కుటుంబ వ్యవస్థ నిలబడు తుందా? మనిషి తన స్వసుఖం, సంతోషం మాత్రమే ముఖ్యమనుకుంటే ఈ సమాజం అస్తవ్య స్తమవుతుంది. కొంచెం సర్దుబాటు, ఎదుటి మని షిని అర్థం చేసుకోవటం ముఖ్యంగా ప్రతి మనిషికీ వుండాల్సిన లక్షణాలు. అంతెందుకు..ఇప్పుడు మీ అమ్మ నన్నే పురుషాహంకారిగా భావించి ద్వేషిస్తే ఈ కుటుంబం ఏమౌతుంది? భావోద్రేకాలు దగ్గరి వాళ్లమీద చూపటంలో తప్పులేదు. అదివాళ్లమీద వున్న ప్రేమ..వాళ్ల క్షేమం ఆశించి పడే తాప త్రయం. కాకపోతే గతి తప్పకూడదు. నీ విష యంలో ప్రతాప్ తప్పు కొంచెం వుంది. కాదన్ను. అయితే నీమీద వున్న ప్రేమ, నీకేదైనా జరుగుతుం దేమో అన్న ఆరాటం కూడా త్రోసివేయలేం. అతని స్థానంలో నిలబడి ఆలోచించు. అర్ధరాత్రి ఆడపిల్ల ఒంటరిగా క్షేమంగా తిరిగే పరిస్థితులు న్నాయా మన దేశంలో? ఎన్ని దారుణాలు వినటం లేదు. కొంచెం జాగ్రత్తగా వుండాలనటంలో తప్పు లేదు''

''ప్రతాప్ నన్ను కొట్టాడు డాడీ!''

''నిజమే... అదుపు తప్పాడు. తప్పు తెల్సుకుని క్షమాపణ కోరాడు కదా! కొంచెం ఔదార్యంతో ఆలోచించు. పశ్చాత్తాపానికి మించిన శిక్ష ఏముంది? అదలా వుంచు. బేబీకి జ్వరం అంటే నా మనసే కలత పడిందే! నీ పేగు తెంచుకుని పుట్టిందే, రక్తసంబంధాన్ని అంత తేలిగ్గా ఎలా తీసి పడేయగలుగుతున్నావ్? నీ చిన్నప్పుడు నీకేదైనా సుస్తీ చేస్తే అమ్మ ఎంత తల్లడిల్లేదో తెలుసా? అమ్మ ఒడిలో పడుకుని నువ్వెంత నిశ్చింతగా వుండేదా నివో గుర్తుచేసుకో! ఆ మాతృత్వం మధురిమ, ప్రేమ ఈ చరాచర సృష్టి అంతా నిండి వున్నదే. దాన్ని ప్రతాప్‌మీద కోపంతో చేజార్చుకుంటావా? నీ గుండెమీద చేయి వేసుకుని చెప్పు. నువ్వు నిజంగా వాళ్లకు దూరమై ప్రశాంతంగా జీవించగ లవా?''

''కానీ..డాడీ..''

''నువ్వేం చెప్పబోతున్నావో నాకు తెలుసు. మాతృత్వం ఆడదానికో బలహీనత అంటావు! దాన్నడ్డం పెట్టుకుని మగవాడు ఆడిస్తున్నాడం టావు. ఈ భావాలు బలంగా ఎలా పాదుకు న్నాయో కూడా నాకు తెల్సు. కొన్ని విషయాలు చదవటానికీ, చర్చించటానికి బావుంటాయి. జీవి తానికి అన్వయించుకున్నప్పుడు సర్దుబాటు తప్పని సరి. ఆధునికతలోంచి మనకు సౌకర్యంగా సుఖంగా వుండే విషయాల్ని తీసుకోవాలి. దాన్తో మమేకం అయిపోతే కృత్రిమత్వంలో కూరుకుపోతాం! భర్త పెట్టే హింసలన్నీ భరించి జీవచ్ఛవంలా వుండమని నా అభిప్రాయం కాదు. చిన్న చిన్న స్పర్థలను భూత ద్దంలోంచి చూసి ఏవేవో ఆపాదించుకుని జీవి తాన్ని అశాంతిపాలు చేసుకోకూడదంటాను. రాజీ పడటం అంటే ఓడిపోవటం అనుకుంటారు చాలా మంది. అది అన్ని విషయాల్లోనూ కరెక్ట్ కాదు. కొన్ని సందర్భాలలో సంయమనం పాటించి రాజీప డటం ప్రశాంతతకు ఆలంబన మాత్రమే. విధ్వంసం కంటే ఒద్దిక మంచిదేమో ఆలో చించు!'' నెమ్మదిగా స్పష్టంగా, మృదువుగా అన్నాడు మధుసూదనం.

శమంత మౌనంగా ఏదో ఆలోచించసాగింది.

భర్త వంక కొత్తగా, అబ్బురంగా చూసింది ప్రభావతి.

☆